వేగవంతంగా మహా సంప్రోక్షణ

టిటిడి జేఈవో వీరబ్రహ్మాం

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : మార్చి 5 నుండి 9వ తేదీ వరకు జరిగే ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ పనులు వేగవంతంగా చేయాలని అధికారులను టి టి డి వీరబ్రహ్మాం అధికారులు ఆదేశించారుఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామివారి ఆలయంలో మార్చి 5 నుండి 9వ తేదీ వరకు మహా సంప్రోక్షణ కార్యక్రమాలు శాస్త్రక్తంగా నిర్వహించనున్నట్లు టిటిడి జేఈవో శ్రీ వి.వీరబ్రహ్మాం చెప్పారు. శ్రీ కోదండరామ స్వామివారి ఆలయంలో

జరుగుతున్న జీర్ణోదరణ మరమ్మత్తు పనులు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం జేఈవో అధికారులతో ఒంటిమిట్టలో సమీక్ష

-2లో

విశాలాంధ్ర

వైయస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

బుధవారం 12, ఫిబ్రవరి 2025 | 8 పేజీలు

జగనన్న ఇళ్లపై..

విచారణ

- అనర్హుల్లో గుబులు

విశాలాంధ్ర-రాయచోటి:
రాయచోటి నియోజవర్గంలో గత వైసిపి ప్రభుత్వం జగనన్న పక్కా గృహాలు ఇళ్ల స్థలాలు పై విచారణ ఆదేశించడంతో అనర్హులు పొందిన గృహాలు ఇళ్ల స్థలాల లబ్ధిదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం పేదల పేరుతో ఇచ్చిన పక్కా గృహాలు ఇళ్ల స్థలాల పై కూటమి ప్రభుత్వం అర్హులు అనర్హులు పై వెంటనే విచారణ జరిపి ఈనెల 15వ తేదీ లోపు నివేదిక అందజేయాలని రెవిన్యూ శాఖను ఆదేశించింది. అందరికీ పక్కా గృహాలు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో భారీగా అనర్హులు చోటు చేసుకున్నారని, అనర్హులు లబ్ధి పొందాలని కూటమి ప్రభుత్వం విచారణ ఆదేశించడం జరిగింది. ఐదు రోజులపాటు రెవెన్యూ శాఖతో సర్వే చేయించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 15లోగా సత్వరం నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది అందరికీ ఇల్లు స్థలాల్లో ఎంతమంది ఇల్లు కట్టుకున్నారనే విషయంపై సర్వే చేయనున్నారు. అధికారులు ఇచ్చిన స్థలాల్లో ఎంతమందికి పట్టాలు ఉన్నాయని తేల్చనున్నారు. ప్రధానంగా అనర్హులను గుర్తించనున్నారు. సర్వేకు

-2లో

ఎస్సీ మహిళలు ఆర్థికంగా

అభివృద్ధి చెందాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

విశాలాంధ్ర-రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ రుణాలను పొంది జీవనోపాదులు మెరుగుపరచుకొని ఎస్సీ మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి చెందాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ నందలి పిజిఆర్ఎస్ హాలులో సెర్ఫ్, ఎస్సీ కార్పొరేషన్ ఏపీ షెడ్యూల్డ్ క్యాస్ట్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

-2లో

పులివెందులలో..

వైసిపికి ఝలక్..

- తొలి వికెట్ డౌన్
- ఫ్యాన్‌ను వీడిన మహిళా కౌన్సిలర్
- టిడిపి కండువా కప్పుకున్న షాహిదా

విశాలాంధ్ర-పులివెందుల:
పులివెందుల పట్టణంలో ఓ కౌన్సిలర్ ఝలక్ ఇచ్చారు. ఫ్యాన్‌ను మహిళా కౌన్సిలర్ వీడి టిడిపి కండువాగప్పుకున్నారు. తొలి వికెట్ తీసిన ఘనత తూగుట్ల మధుసూదన్‌రెడ్డికే దక్కింది. పట్టణంలో మంగళవారం చెన్నారెడ్డికాలనీలో వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ తుగూట్ల మధు సమక్షంలో 30వ వార్డు కౌన్సిలర్ షాహిదా ఆమె భర్త సిద్దయ్యలు టిడిపిలో చేరారు. వీరితో పాటు సిద్దయ్య అనుచరవర్గ 20 కుటుంబాలు టిడిపిలో చేరాయి. గతంలో టిడిపి ఇన్‌చార్జి బిటెక్ రవి మాట్లాడుతూ నీవు నీర్పేనవిద్యయే నీరజాక్ష అన్నారు. వైసీసీ ప్రభుత్వ హయాంలో ఏ రాజ్యాంగాన్ని అనుసరించారో

-2లో

విద్యుత్‌ఘాతంతో

తల్లీ, కొడుకు మృతి

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బద్వేల్ టిడిపి ఇన్‌చార్జ్ విజయమ్మ

వార్త-7లో

వార్త-5లో

మదనపల్లి టీడీపీలో

ముదిరిన వర్గపోరు

శ్రీరామ్ చిన్నబాబు, ఎమ్మెల్యే షాజహాన్ బాషా మధ్య చెలరేగిన చిచ్చు

30 యాక్టును అమల్లోకి తీసుకొచ్చిన పోలీసులు

ఏఎన్ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయండి

విశాలాంధ్ర - బద్వేలు : గత 18 సంవత్సరాలుగా సబ్ సెంటర్లలో కాంట్రాక్ట్ ఏఎన్ఎం గా పనిచేయుచున్నారు. కానీ ఇంతవరకు వారికి రెగ్యులర్ కాక ఎంతో మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు వారికి వేతనాలు పెరగక, చాలీచాలని వేతనాలు చెల్లిస్తున్నారని ఏఎన్ఎం, సునీత ప్రసన్నాలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం పంచా యతీరాజ్ కింద పనిచేసే ఏఎన్ఎం లను సబ్ సెంటర్లతో కలిపేందు కు ప్రయత్నిస్తున్నారు. ఇలా జరిగితే మాకు తీరని అన్యాయం జరిగే అవకాశం ఉంది. 2007లో నుండి తాము పనిచేస్తున్న, 2011లో స్వల్పంగా వేతనాలు పెంచి ఇంతవరకు వేతనాలు పెంచలేదు. మమ్ములను రెగ్యులర్ చేయమని ఎన్నోసార్లు వినతి పత్రాలు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి ఉన్నాము. ఇంతవరకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రెగ్యులర్ కాక ఎంతోమంది మానసిక ఆందోళన చెందుతున్నారు. సమాన పనికి సమాన వేతనం కోర్టు తీర్పు ఇచ్చిన ఇంతవరకు అమలు కాకపోవడం విచారకరం. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా బ్రతుకులు మారలేదు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మా ఆవేదన ఆలకించి మమ్ములను రెగ్యులర్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు: ముక్కా వరలక్ష్మి

విశాలాంధ్ర -రైల్వేకోడూరు : ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు అని కడప కుడ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గజ్జల రమణారెడ్డి ఆహ్వానం మేరకు మంగళవారం ఉదయం ముక్కా వరలక్ష్మి బయలుదేరి ఓబులవారిపల్లి మండలంలోని బాలిరెడ్డిపల్లి సమీపంలో వెలసిన శ్రీఅభయ ఆంజనేయస్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించు కున్నారు. ఆలయ అర్చకులు వరలక్ష్మి కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కంబాలకుంట నాగరాజు, నాగెళ్ల రామిరెడ్డి, మాచుపల్లి రామచంద్రారెడ్డి,కల్లూరి ఈశ్వర్ రెడ్డి, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

..జగనన్న ఇళ్ళపై విచారణ

(మొదటి పేజీ తరువాయి) సంబంధించిన చెక్ లిస్ట్ ఫార్మేట్ ని కూడా జిల్లాల కలెక్టర్లకు పంపింది దాంతో ఆయా అంశాల వారీగా సర్వే చేయనున్నారు. రెవిన్యూ శాఖ అధికారులు గతంలో అనర్హులు ఇళ్ల పట్టాలు పొందాలని కొంతమంది ఇంట్లో ఇద్దరు ముగ్గురికి కూడా ఇళ్ల పట్టాలు ఉన్నాయని పెద్ద ఎత్తున ఆరోపణలు వ్యక్తం అయ్యాయి. జగనన్న కాలనీలలో వైసిపి కార్యకర్తలు పట్టాలు పొంది అమ్ముకున్న సంఘటనలు, ఇల్లు మంజూరు చేయించుకుని ఇండ్లను అమ్ముకున్న కార్యకర్తలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామాలలో జగనన్న గృహాలు అనర్హులు మంజూరు చేయించుకుని పాత గృహాలకే బిల్లులు చేయించుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఒక్కొక్కరు రెండు మూడు ఇళ్ళను కూడా కలిపి నిర్మించుకున్న సంఘటన అనేక ఉన్నాయి. అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి తే వాస్తవాలు బయటకు వస్తాయి గృహ నిర్మాణ శాఖలో కొందరు అధికారులు మామూళ్లు తీసుకుని అనర్హులకు బిల్లులు చెల్లించిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. రామాపురం, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మండలాలలో గత ప్రభుత్వంలో పక్కా గృహాల్లో భారీ అవినీతి జరిగినట్లు ఆరోపణలు బలంగా ఉన్నాయి. అధికారులు విచారణ అనడంతో అనర్హుల్లో ఆందోళన మొదలైంది.

ఆంజనేయ స్వామి గుడి వద్ద అన్నదానం



విశాలాంధ్ర - ఒంటిమిట్ట : ఒంటిమిట్ట చెరువు కట్టమీద వెలసిన ఆంజనేయస్వామి గుడి వద్ద మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ అన్ని దానాల కెల్లా అన్నదానం గొప్పది అన్నారు అన్నదాన కార్యక్రమానికి దాతలు విరాళాలు ఇవ్వడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్ర మంలో అధ్యక్ష ఉపాధ్యక్షులు రమణమ్మ వెంకటేశ్వర్లు నిర్వాహకులు పాల్గొన్నారు.

బండి నరవ దేవాలయానికి మహర్దశ

- రూ.కోటి నిధులు మంజూరు...

- ఫలించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ యువనేత రితీష్ రెడ్డిల ప్రయత్నం

విశాలాంధ్ర -బద్వేలు : పోరుమామిళ్ళ మండలం టేకూరుపేట రోడ్డులో గల బండి నరవ దేవాలయ ప్రదేశంలో పోరుమామిళ్ళ, బికోడూరు, కాశినాయన, కలసపాడు మండలాల లోని దాతలు సహకారం తో 108 శివలింగములతో శ్రీనందీశ్వరాలయాన్ని నిర్మిం చి సదరు ప్రదేశాన్ని కడప జిల్లాలోనే ఒక గొప్ప ఆధ్యాత్మిక ధార్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సంకల్పిం చడం జరిగింది. భక్తుల సంకల్పం కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు మాజీ ఎమ్మెల్యే కొనిరెడ్డి విజయమ్మ బద్వేల్ తాలూకా తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రితేష్ రెడ్డి విశేషమైన కృషితో దేవాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి కోటి రూపాయలు ప్రభుత్వ నిధులను దేవాలయ నిర్మాణం కొరకు మంజూరు చేయించడం జరిగింది. ఈ సందర్భంగా బండి నర్వ దేవాలయ కమిటీ సభ్యులు దేవాదాయ శాఖ మంత్రి వర్యులు ఆనం రామనారాయణ రెడ్డి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ రితేష్ రెడ్డి కృతజ్ఞతలు తెలియ జేయడం జరిగింది. బండి నరవ దేవాలయ గౌరవ అధ్యక్షులు బీరం రామలక్ష్మి రెడ్డి సహకారంతో బండి నర్వ దేవాలయ కమిటీ అధ్యక్షులు పంగా గురివిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నూనె శ్రీనివాసులు, సభ్యులు పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, ,ఫణీరావు స్వామి, కల్లూరు రాంభూపాల్ రెడ్డి, పెద్దిరెడ్డి రమణారెడ్డి, గుర్రం పుల్లపనాయుడు, బీరం రామ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బద్వేల్ పార్టీ కార్యాలయంలో విజయమ్మ ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమం లో టేకూరుపేట చంద్రయ్య, నరసింహ రెడ్డి,వెంకట్రాం రెడ్డి ,పద్మనాభ రెడ్డి, కమ్మవారిపల్లె నవీన్ మొదలగు వారు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భం గా విజయమ్మ మాట్లాడుతూ బండినరవ దేవాలయ ప్రాంతం ఆధ్యాత్మిక క్షేత్రంగా, టూరిస్ట్ ప్లేస్గా అభివృద్ధి చేయుటకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని తెలియజేశారు.

పులివెందులలో వైసీపీకి ఝలక్

(మొదటి పేజీ తరువాయి) అదే రాజ్యాంగాన్ని తాము కూడా అనుసరిస్తామని చెప్పకనేచెప్పారు. ఈ దఫా ఎలాగైనా మున్సిపల్ పీఠాన్ని టిడిపి కైవశం చేసుకోవాలనే ఆలోచనలో ఉంది. ఆ మేరకు సోమవారం వైసీపీకి చెందిన 30 కుటుంబాలు టిడిపిలో చేరడంతో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మొత్తం పట్టణ పరిధిలోని 33 వార్డులు ఉన్నాయి. ఇందులో 30వ వార్డు కౌన్సిలర్ టిడిపి వైపు వెళ్లి బోణీ చేశారు. అయితే ఇంకా ఎంత మంది వైసీపీ కౌన్సిలర్లు టిడిపి వైపు మొగ్గు చూపుతారా అన్న అంశం తేలాల్సి ఉంది. ఎన్డీయే అధికారం చేపట్టిన తర్వాత వైసీపీ అధినాయకులు తమ కౌన్సిలర్లు ఏ పార్టీ వైపు వెళ్లరని గంభీరంగా పలికారు. ఈ లోపు మహిళా కౌన్సిలర్ టిడిపి వైపు వెళ్లడం విశేషంగా మారింది. పులివెందుల మున్సిపాలిటీ పైన సీఎం చంద్ర బాబు వద్దకు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఇందుకు చంద్రబాబు పచ్చజెండా ఊపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసిపి కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు టిడిపి వైపు ఎలా మొగ్గు చూపు తారోనని, వారి బలహీనతలపై బిటెక్ రవి ఒక అంచనాకు వచ్చినట్లు తెలు స్తోంది. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో తెలుగుదేశం సత్తా చూపించాలని బిటెక్ రవిని చంద్రబాబు ప్రోత్సహిం చినట్లు ఆ పార్టీ వర్గీయుల వ్యాఖ్యానిస్తున్నారు. మరి వైసీపీ పెద్దలు ఎలా స్పందిస్తారో టిడిపి వైపు మొగ్గు చూపే కౌన్సిలర్లకు ఎలాంటి అడ్డుకట్ట వేస్తారో వేచి చూడాల్సిందే. కార్యక్రమంలో టిడిపి నాయకులు తూగుట్ల సిద్దారెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బానిసత్వపు పార్టీలో ఇమడలేకనే - కౌన్సిలర్ షాహిదా:

బానిసత్వపు పార్టీలో ఇమడలేకనే టిడిపిలో చేరానని కౌన్సిలర్ షాహిదా వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ ఈ వైఎస్ఆర్సిపి పార్టీలో కష్టపడే వారికి ప్రాధాన్యత్వం లేదని విలువ లేని పార్టీలో ఉండకూడ దని నిర్ణయించు కొని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు చేపట్టే సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై పులివెందుల తెలుగుదేశం ఇన్చార్జ్ బీటెక్ రవి ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధి చెందుతుందని అలాగే మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగుట్ల మధు తోడ్పడుతో పులివెందుల తెలుగుదేశం పార్టీలో కష్టపడతామ న్నారు. పులివెందుల మున్సిపాలిటీ కౌన్సిలర్లను కౌన్సిలర్ గా చూడడం లేదని బానిసల్లాగా చూస్తున్నారని కౌన్సిలర్ వాపోయారు. గౌరవ మర్యాదలు ఇచ్చే పార్టీ ఒక తెలుగుదేశం పార్టీనేనని పులివెందుల తెలుగుదేశం ఇన్చార్జి బీటెక్ రవి మీద నమ్మకంతో మేము ఈ పార్టీలో చేరుతున్నామన్నామని 30 వార్డు కౌన్సిలర్ షాహిదా చెప్పారు. వైసీపీ నాయకులు తమను బానిసల కంటే హీనంగా చేశారని, అందుకే విలువలు, విశ్వసనీయత లేని పార్టీలో ఉండకూడదనే నిర్ణయానికి వచ్చి తాము టిడిపిలో చేరామని స్పష్టంచేశారు.

.. ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

(మొదటి పేజీ తరువాయి) సంయుక్త ఆధ్వర్యం లో గ్రామీణ ప్రాంత స్వయం సహాయక సంఘాలలో ఉన్న ఎస్సీ మహిళలకు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం ప్రధానమంత్రి అను సుచిత్ జాతి అభ్యుదయ యోజన పథకంపై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళ స్వయం సహాయక సంఘాలలో ఉన్న ఎస్సీ మహిళల జీవనోపాదుల మెరుగుదలకు రాయితీతో వడ్డీ లేని రుణాలను అందజేస్తున్నాయన్నా రు. ఈ మేరకు అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 48 యూనిట్లకు రాయితీతో కూడిన వడ్డీ లేని రుణాలు రూ.74.50 లక్షలు మంజూరు కావడం జరిగింద న్నారు. ఇందులో లబ్ధిదారుల వాటా 10 శాతం రూ.7.50 లక్షలు, సంఘంలో ఉన్న ప్రతి సభ్యురాలికి రూ.50వేలు రాయితీతో రూ.24 లక్షలు, సెర్ప్-ఉన్నతి ద్వారా వడ్డీ లేని రుణం రూ. 43 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. ఇలాంటి మంచి పథకాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని, వారి జీవనోపాదులను మెరుగుపరుచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంత రం మంజూరైన రుణాలను మహిళలకు అందజేశా రు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి దాసరి నాగార్జున, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కలమల్ల సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

విశాలాంధ్ర-యర్రగుంట్ల : కలమల్ల 1 గ్రామ సచివాలయంను ఎంపిడిఓ మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా సచివాలయం దగ్గర సిమెంట్ రోడ్డు మీద మురికి నీరు ప్రవహించడాన్ని గమనించి పంచాయతీ కార్యదర్శి వారితో కలిసి వెళ్ళి ఇంటి యజమానులకు మురికి నీరు రోడ్డు మీద వదలడం వల్ల ప్రజలు జారి కింద పడటంతో పాటు ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. కావున ఎవరు ఇంట్లో మురికి నీరు రోడ్డు మీదకి వదల వద్దు అని సూచించారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను పిలిపించి రోడ్డు మీదకి మురుగు నీరు వదలకుండా ఇంటి యజమానులకు సోక్ పిట్ ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. కలమల్ల గ్రామంలో ఇంకా ఎవరికైనా ప్రజలకి సోక్ పిట్ అవసరం ఉన్నట్లయితే వారి వివరాలు కూడా సేకరించి తనకి పంపించాలని ఆదేశించారు. ఎంపిడిఓ వెంట కలమల్ల పంచాయతీ కార్యదర్శి హరినాథ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

...మహా సంప్రోక్షణ

(మొదటి పేజీ తరువాయి) నిర్వహిం చారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడు తూ గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం గత ఏడాది సెప్టెంబరు 6 నుండి 8వ తేదీ వరకు "బాలాలయం"నిర్వహించినట్లు తెలిపారు. భారత పురాతత్వ శాఖ ఆధ్వర్యంలో ఆలయంలో పునరుద్ధరణ పనులు నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. సకాలంలో ఆలయ పునరు ద్ధరణ పనులను పూర్తి చేయాలని టిటిడి అధికారులను కోరారు. మార్చి 5 నుండి 9వ తేదీ వరకు ఆలయంలో మహా సంప్రోక్షణ నిర్వహించి, భక్తులకు మూలమూర్తి దర్శనం కల్పించనున్నట్లు తెలియజేశారు. కడప జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని స్వామివారి బ్రహ్మో త్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం త్వరలో జిల్లా అధికారులతో కలిసి బ్రహ్మోత్స వాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు వివరిం చారు.ఒంటిమిట్ట ఆలయ పునరుద్ధరణ పనులు, ఏప్రిల్ నెలలో జరగనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అన్ని విభాగాల అధికారులతో జేఈవో సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని వేసవి నేపథ్యంలో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం జేఈవో ఆలయంలో జరుగుతున్న మరమ్మత్తు పనులు, కళ్యాణ వేదిక వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సిఈ శ్రీ సత్యనారాయణ, ఎస్ఈ (ఎలక్ట్రికల్) శ్రీ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవో శ్రీ పి.వి.నటేష్ బాబు, విజిఓ శ్రీమతి సదాలక్ష్మి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-పులివెందుల: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న శ్రీరంగనాథస్వామి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు సోమేపల్లి కృష్ణ రాజేష్ నేతృత్వంలో అర్చక బృందం శశిధర్, నాగపనీంద్ర, రాజసింహ శర్మల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే హోమాలను నిర్వహించి కలశాలను ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, ఈవో వెంకట రమణ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల ధ్వజా రోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులను శ్రీ రంగనాథ స్వామి ఆలయం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించే పూలంగల్ల సర్కిల్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. పులివెందులలో శ్రీ రంగ నాథ స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 19వ తేదీ వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి, ఈవో వెంకట రమణలు తెలిపారు. తొలిరోజున శ్రీరంగనాథ స్వామి సూర్యప్రభ -చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చా రు. ఈ సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రతిరోజూ రాత్రి 8 గంటలకు పులివెందుల పట్టణంలోని పూలంగల్ల సర్కిల్లో ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో నులిపురుగుల నివారణ

విశాలాంధ్ర-కడప వైవీయూ : జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినం సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం యూనిట్ -9 ఆధ్వర్యంలో స్థానిక శివాజీ నగర్ అంగన్వాడీ కేంద్రంలో నులిపురుగుల మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైవీయూ జాతీయ సేవా పథకం యూనిట్ -9 కోఆర్డినేటర్ డాక్టర్ కె. శ్రీనివాసరావు మట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రత పాటించక పోతే నులిపురుగులు శరీర ఎదుగుదలను అడ్డుకుంటాయన్నారు. ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి నులిపురుగుల నివారణకు కృషి చేయాలన్నారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా. క్రిష్ణయ్య, పాల్గొన్నారు.

సౌమ్యనాథ స్వామి హుండీ ఆదాయం రూ.4,96,388

విశాలాంధ్ర-నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన, చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి హుండీ ని మంగళవారం లెక్కించగా 4,96,388/- రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక నెల తరవాత హుండీని లెక్కించడం జరిగిందని అన్నారు. వచ్చిన మొత్తాన్ని బ్యాంకులోని ఆలయ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ గురు స్వామి యాదవ్, విజిలెన్స్ అధికారి భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ డిగ్రీ ఫలితాలలో శ్రీసాయి డిగ్రీ ప్రభంజనం



విశాలాంధ్ర - రైల్వేకోడూరు : శ్రీ యోగివేమన విశ్వ విద్యాలయం వెల్లడించిన అనుబంధ కళాశాల 1, 3, 5వ సెమిస్టర్ డిగ్రీ పరిక్ష ఫలితాలలో శ్రీసాయిడిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బివిస్సీ కంప్యూటర్ నందు పోలి పల్లవి, పోతురాజు ప్రత్యూష, పూజిత, షేక్ ఆయేషా, షేక్ మునిర 10/10 జిపిఎ, బికాం కంప్యూటర్స్ నందు గాధంశెట్టి మౌనిష, పలిగల జస్వంత్ 10/10 జిపిఎ, బివిస్సీ బొటనీ నందు షేక్ రబియా 9.75/10, షేక్ నజీమ్ 9.70/10, జాస్మిన్, జి లక్ష్మిప్రసన్న 9.50/10 సాదించారు. 99 మంది 9 జిపిఎ సాదించారు. 92 శాతం మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని మంగళవారం ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య పాత్రికేయులకు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య, డైరెక్టర్లు పి శ్రీనివాసులు, ఎస్ఎన్ శ్రీనివాసులు, కంచిరాజు చంగల్ రాజు, యు అనిత, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

క్రైస్తవ మైనార్టీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

టిడిపి క్రిస్టియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామి దాసు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : క్రైస్తవ మైనార్టీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలుగు దేశం పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు స్వామిదాసు పేర్కొన్నారు. మంగళవారం ఎర్రగుంట్ల టీడీపీ కార్యాలయం నందు జమ్మల మడుగు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బ రామిరెడ్డి ఆదేశాల మేరకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం వైసీపీ నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి చంద్ర బాబు నాయుడు క్రైస్తవులకు చేసింది ఏమీ లేదని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో నారా చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉంటేనే అన్ని వర్గాల ప్రజలు బాగుపడతారన్నారు. క్రైస్తవుల సంక్షే మం, అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టారన్నారు. 2014-19 ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఉన్నప్పుడు గుంటూరు, విజయవాడ సమీపంలో రెండు ఎకరాలు స్థలం కేటాయించి, క్రిస్టియన్ భవన్ ఏర్పాటు రూ. 10కోట్లు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. 80 శాతం పూర్తి అయిన క్రిస్టియన్ భవనాన్ని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిపివేసి క్రైస్తవులు అభివృద్ధికి నోచకుండా చేసిందన్నారు. 2019 ఎన్నికల్లో నేను క్రైస్తవుడిని నన్ను గెలిపించండి అంటూ ప్రజల వద్ద వేడుకుని సీఎం అయిన తర్వాత క్రైస్తవులను నిలువనా మోసం చేశారన్నారు. జగన్మో హన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు క్రైస్తవులకు క్రిస్మస్ పండుగ కానుకగా క్రైస్తవులకు కేవలం 30వేలు మాత్రమే ఇచ్చేవాడని, అదే నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే క్రిస్మస్ పండుగకు ఇచ్చే రూ.30వేలను రూ.లక్ష రూపాయలకు పెంచాడన్నారు. దీన్నిబట్టి క్రైస్తవుల మీద ప్రేమ ఎవరికి ఎక్కువ ఉందో అర్థం అవుతుంది అన్నారు. సీఎం చంద్రబాబు మన బడ్జెట్ సమావేశాల్లో క్రైస్తవుల అభివృద్ధి కోసం రూ.150 కోట్లు ప్రవేశపెట్టారన్నారు. క్రైస్తవులు జెరూసలేం యాత్రలకు, విదేశీ విద్యకు సంక్షేమ పథకాల కోసం బడ్జెట్లో రూ.150 కోట్లు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అలాగే క్రైస్తవులు చిరు వ్యాపారం చేసుకునే అవకాశం కల్పిస్తూ.. లక్ష రూపాయలు సబ్సిడీ ఇచ్చే విధంగా 249 మంది క్రైస్తవులకు బడ్జెట్ విడుదల చేయడం జరిగిందన్నా రు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ రెడ్డి, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జగట విజయశేఖర్, దీపక్, మాజీ ఎంపీ టీసీ మంగపట్నం వరప్రసాద్, కేశవ నారాయణ, ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు జయ ప్రకాష్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పేరుతో పైసా వసూల్

విశాలాంధ్ర - జమ్మలమడుగు : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పేరుతో కళాశాలలు పైసా వసూలు చేస్తున్నారని రాయ లసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, లింగ మయ్య పేర్కొ న్నారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ కడప జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ ఎగ్జామ్స్ సోమ వారం నుండి మొదలైనాయి,అయితే ఈ ఎగ్జామ్స్ కు 51 సెంటర్లలో 2432 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ కు హాజరవుతున్నారు.కొంత మంది విద్యార్థులను విచారించగా జిల్లా వ్యాప్తంగా సెంటర్ల యాజమాన్యా లు ఇదే సాకుగా తీసుకొని విద్యార్థుల దగ్గర 800 నుండి 1000 వెయ్యి రూపాయల వరకు వసూలు చేస్తున్నారు అని ఆరోపించారు. అయితే జిల్లా అధికారులు సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ప్రాక్టి కల్ జరుగుతున్నాయని చెపుతున్నప్పటికీ ఎంతవరకు నిజమో తెలియాల్సి ఉందన్నారు. ఈ ప్రాక్టికల్స్ కు జిల్లా వ్యాప్తంగా లక్షల రూపాయల వసూలు చేస్తు న్నారు. ఈ లక్షల సొమ్ము కళాశాలల యాజమా న్యా లు వారి జేబులు నింపుకుంటున్నారని వారు విమర్శిం చారు. దీని విద్య శాఖ అధికారులు,జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని వారు కోరారు.

అర్చకుడిపై దాడి అమానుషం

విశాలాంధ్ర-వేంపల్లి: సమాజ హిత మే ధ్యేయం గా సనాతన ధర్మమే ఊపిరిగా పనిచేస్తున్న అర్చకు లపై దాడి చేయడం అమానుషమని అఖిల భారత బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ అన్నారు. ఆ మేరకు స్థానిక వాసవి కళ్యాణ మండపం లో హిందూ సంఘాలు తో కలిసి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో ఉన్న ప్రముఖ పుణ్య క్షేత్రం చిలకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ పై దాడి ని ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు.ఈ దేశంలో సనాతన ధర్మాన్ని కాపాడమే ధ్యేయంగా పనిచేస్తూ మన సంస్కృతి సంప్రదాయాలను సమాజంలోనికి తీసుకు వెళ్తున్న అర్చకులను అసభ్య పదజాలంతో దూషించి దాడి చేసిన రామరాజ్యం వ్యవస్థాపకులు వీర రాఘవరెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకొని అతనిని అరెస్టు చేయాలని అన్నారు సమాజంలో ఇటువంటి ఘటనలు జరుగుతున్నప్పుడు అక్కడ ఉన్నటువంటి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని ఆయన అన్నారు ఇలాగే చూస్తూ ఉంటే మన సంస్కృతి మీద ధర్మం మీద దాడి జరిగే ప్రమాదం ఉందని ఆయన అన్నారు ఇటువంటి సంఘటనలను యావత్తు హిందువులు ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు ఆంధ్రప్రదేశ్లో హిందువులను ఏకం చేస్తూ నిర్వహించిన హైందవ శంఖారావం విజయవంతమైనప్పటికీ ఇలాంటి ఘటనలు జరగడం చాలా బాధాకరమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో అర్చకులు ప్రసాద్ శర్మ, మురళి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షురాలు పి సుప్మ, నాయకులు దొంతు సుమన్, రంగారెడ్డి, కుమార్, సునీల్ కుమార్, ఈశ్వర్ రెడ్డి, చరణ్, సురేష్ నాయకులు అంజన్ కుమార్,సుబ్బారావు, చందు, వినోద్,మహేష్ గంగిరెడ్డి సుబ్బారావు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

విశాలాంధ్ర-నందలూరు : బాల్య వివాహాలు చేయడం నేరమని పానల్ న్యాయవాది వినయ్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి సూచనల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ బాబా ఫక్రుద్దీన్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ భార్గవి ఆదేశాల మేరకు మంగళవారం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీలో సర్వే నిర్వహిం చడం జరిగింది. మండలం నందు పుట్టిన పిల్లలకి, బుద్ధిమాంద్యం గల పిల్లలకి వారికి కావాల్సిన చికిత్స మేర కు సూచనలు ఇస్తూ ఇంటింటి ప్రచా రం నిర్వహించడం జరిగింది అని పానె ల్ న్యాయవాది వి. వినయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ గోపీనాథ్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్తో తల్లి, కొడుకు మృతి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : బికోడూరు మండలంలోని గుంతపల్లి గ్రామానికి చెందిన కూరాకు జయరాం రెడ్డి (48), గురమ్మ (60) విద్యుత్ షాక్ తో మృతి చెందారు. గుంతపల్లి గ్రామ సమీపాన ఉన్న తెలుగుగంగ కాలువలో మోటర్ పెట్టి పొలానికి నీరందిస్తున్నారు. మోటరు ఆడక పోవటంతో చిన్నపాటి మరమ్మత్తులు చేస్తున్న సమయంలో జయరాం రెడ్డికి విద్యుత్ షాక్ తగిలి గిలగిలా కొట్టుకుంటుండగా తల్లి గురమ్మ గమనించి కొడుకును పట్టుకోవటం తో ఆమె కూడా విద్యుత్ పాకు గురై చనిపోయింది. వీరి ఇరువురు చనిపోవడంతో గుంతపల్లి గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. బి కోడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : పోరుమామిళ్ల సీఐ డి. శ్రీనివాసులు ఎస్ఐ ఆర్.వి. కొండా రెడ్డి మండలంలో ఓవర్ లోడ్ తో వెళ్తున్న ఆటోలను ఆపి డ్రైవర్లకు కౌన్సి లింగ్ ఇచ్చి వారిపై కేసులు నమోదు చేయ డం జరిగింది. ఆటో డ్రైవర్లు అన్ని రకాల రికార్డులు కలిగి ఉండాలి అని, యూని ఫామ్ కలిగి ఉండాలి అని, ఎవరైనా ఆటోలో ఎక్కువ మందిని ఎక్కించుకున్నా, ఆటోపైన కూర్చో బెట్టినా, పక్కల నిలబెట్టుకున్నా చర్యలు తీసుకొని కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందచేత

విశాలాంధ్ర-కడప క్రైం : రాజుపాలెం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఎ.వెంకట సుబ్బయ్య కుటుంబానికి జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు అదనపు ఎస్.పి (పరిపాలన) కె.ప్రకాష్ బాబు పోలీస్ వితరణ నిధి నుండి రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందచేశారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాల యంలో హెడ్ కానిస్టేబుల్ సతీమణి ఎ.రాజేశ్వరికి అదన పు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాష్ బాబు చెక్కు అంద చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ దివంగత హెడ్ కానిస్టేబుల్ కుటుంబ యోగక్షేమా లు విచారించారు. కుటుంబానికి తాము అండగా ఉంటా మని భరోసా ఇచ్చారు. అంకిత భావంతో విధులు నిర్వ ర్తించే సిబ్బంది మరణించడం బాధాకర మన్నారు. కార్యక్ర మంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, బి.సెక్షన్ సూపరిం టెండెంట్ బి.శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

యూనివర్సిటీ మొదటి ర్యాంకును సాధించిన శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆణిముత్యాలు

విశాలాంధ్ర - మైదుకూరు : యోగి వేమన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ రెగ్యులర్ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ ఫలితాలలో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు పదికి పది మార్కులు సాధించి యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ ర్యాంక్ లో నిలిచి తమ సత్తా చాటరాని కళాశాల ప్రిన్సిపాల్ దుగ్గిరెడ్డి ఓబుల్ రెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన సమావేశానికి హాజరై విద్యార్థులను జ్ఞాపికలతో అభినందించారు. బి జెడ్ సి గ్రూప్ లో యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన మా విద్యార్థిని ఎస్.ఫాతిమా పర్వీన్(10/10), తో పాటు పలువురు విద్యార్థులు ఉత్తమ శ్రేణి ఫలితాలు సాధించడం పట్ల అభినందనలు పొందారు. ఈ కార్యక్ర మంలో అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

విశాలాంధ్ర-రామాపురం : భార్యను అతి కిరాతకంగా హత్య చేసిన కేసులో భర్త దనుంజయకు ఐదవ అదనపు జిల్లా జడ్జి జీవిత ఖైదు రు 5000 జరిమానా విరిగినట్టు ఎస్సై వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకెళ్తే మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ పాతపల్లి చెందిన మీనిగా ధనుంజయకు సంబేపల్లి మండలం కొత్తపల్లి చెందిన ఉడం భద్రయ్య తన పెద్ద కుమార్తె పెద్ద రెడ్డమ్మ ను వివాహం చేశారు. పెళ్లి సమయంలో కట్న కానుకలు కింద ఏడు తులాల బంగారు లక్ష రూపాయలు ఇచ్చి వివాహం చేశారు. ఇంకా అదనపు కట్నం కోసం తన కుమార్తె మానసికంగా శారీరకంగా వేధిస్తుండేవారిని 2017 ఫిబ్రవరి27 తేదీన రాత్రి 9 గంటల సమయంలో తన అల్లుడు ధనుంజయ తన తమ్ముడు తో కలిసి తన కుమార్తె తల పైన కొట్టి హత్య చేసినట్లు ఫిర్యాదు చేశారు. అప్పటి పులివెందుల అడిషనల్ ఎస్పీ కే కే ఎన్ అమరాజన్ ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ పంపడం జరిగింది. ఆ కేసులో ముద్దాయి ధనుంజయ జీవిత ఖైదు విధిస్తూరు 5000 జరిమాన విధిస్తూ5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి తీర్పునిచ్చినట్లు ఆయన తెలిపారు. సరైన సమయంలో ముద్దాయిలను కోర్టు హాజరు పరిచిన కోర్టు కానిస్టేబుళ్లు ఆదినారాయణ శివప్రసాద్ లను ఉన్నతాధికారులు అభినందించినట్లు తెలిపారు.

అంధుల జీవితాల్లో వెలుగు నింపిన ముక్కా ఫౌండేషన్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : సర్వేంద్రియనామ్ నయనం ప్రధానం అనే సూక్తిని ఆదర్శంగా తీసుకుని కడప కుడ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి ఫౌండేషన్ అందుల జీవితాలలో వెలుగు నింపుతోంది.ఫిబ్రవరి 9 తారీఖున ఆదివారం పుల్లంపేట మండల కేంద్రంలోని ఎస్విబిడి జూనియర్ కళాశాలలో ఉచిత మెగా కంటి వైద్యం శిబిరం నిర్వహించి 160 మందికి ఆపరేషన్ అవసరమని డాక్టర్లు నిర్ధారించారు.ఆపరేషన్ అవసరమైన వారిని అందరిని రూపానందరెడ్డి తమ సొంత డబ్బులతో పుల్లంపేట నుండి తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రికి తరలించారు.అక్కడ కంటి ఆపరేషన్లు పూర్తి చేసుకుని మంగళవారం విజయవంతంగా పుల్లంపేటకు చేరుకున్నారు.అక్కడ ముక్కా రూపానందరెడ్డి ఫ్యామిలీ రిసీవ్ చేసుకున్నారు.ఆపరేషన్లు చేసుకున్న వారికి అందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.భోంచేసినతరువాత బస్సులో సురక్షితంగా అందరినీ వారివారి నివాసాలకు చేర్చి మానవత్వం చాటుకున్నారు.కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారు అందరూ మీకు రుణపడి ఉన్నామని భావోద్వేగంతో రెండు చేతులు జోడించి ముక్కా వరలక్ష్మికి నమస్కరించారు.ఈ కార్యక్రమంలో ముక్కా విశాల్ రెడ్డి, సాయివికాస్ రెడ్డి, శిరీష రెడ్డి,బత్తిన వేణుగోపాల్ రెడ్డి, కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదగాలి

మహిళా పి.ఎస్ ఇన్స్పెక్టర్ జి.ఈదురు బాషా

విశాలాంధ్ర-కడప క్రైం : కడప జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ ఆదేశాలమేరకు జిల్లా లోని విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగేలా పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నగరంలోని ప్రభుత్వ ఉర్దూ బాలికల పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ నుండే క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మహిళా పి.ఎస్ సి.ఐ జి.ఈదురు బాషా విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశ నుండే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. బాగా చదువుకుని సమాజానికి, దేశానికి సేవ చేయాలని సి.ఐ సూచించారు. తల్లిదండ్రుల ఆశల్ని, ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలని ఆకాంక్షిం చారు. దేశ భవిష్యత్తు విద్యార్థులపై, యువతపై ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకుని నడుచు కోవాలని సి.ఐ సూచించారు. అవగాహన కార్యక్ర మంలో పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్ - 100, రహదారి భద్రత, సోషల్ మీడియా సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళా పి.ఎస్ సి.ఐ ఈదురు బాషా తెలియజేశారు. కార్యక్రమంలో యాంటి - హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్.ఐ శాంతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలి: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లిలో అన్ని విధాలా పూర్తయిన రైతు బజార్ ను త్వరగా వినియోగం లోకి తీసుకురావాలని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళ వారం వేంపల్లి రైతు బజార్ ను కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ అటు రైతులకు,ఇటు కొనుగోలు దారులకు ఉభయ తారకంగా వుంటుందన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 1 కోటి 20 లక్షల రూపాయలతో వేంపల్లి లో రైతు బజార్ ను సర్వాంగ సుందరంగా నిర్మించిందన్నారు. 8 రూములు,44 స్టాళ్లు వున్నాయన్నారు. ప్రజలకు,రైతులకు అందుబాటులో ఉందన్నారు. ఒకటిన్నర సంవత్సరం క్రిందటే నిర్మాణాలు పూర్తి అయ్యాయని, మార్కెటింగ్ శాఖ,పంచాయితీ శాఖల మధ్య సమన్వయం లేని కారణంగా ఇప్పటివరకు వినియోగం లోకి రాలేదని తెలిపారు. ఇలాగే కొనసాగితే నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటాయని ప్రస్తుతం రైతులు,కాయగూరలు,ఆకు కూరలు ,పండ్లు అమ్ముకునే వారు రోడ్ల ప్రక్కన ఎండకు ఎండుచూ,వానకు తడుస్తూ, దుమ్ము ధూళితో అపరిశుభ్ర వాతావరణంలో అమ్ముతున్నారన్నారు. జిల్లా అధికార యంత్రాంగం,రాష్ట్ర ప్రభుత్వం ఈ రైతు బజార్ ను త్వరగా వినియోగం లోకి తీసుకు రావాలని తులసి రెడ్డి డిమాం డ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమ ణ్యం, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న,వేమా నాగరాజా,వెంకటేష్, మహ బూబ్ భాషా,బద్రినాథ్, నాగరాజు, అయిచర్ రమణ, వినయ్, సిబ్బంది రుచితా రెడ్డి, సుకూర్, దీవెనమ్మ పాల్గొన్నారు.

టిటిడి కళ్యాణ మండపాన్ని ప్రారంభించాలి: పేదలకు,మధ్య తరగతి వారికి అందుబాటులో వుండే విధంగా టిటిడి వారు 15 సంవత్సరాల క్రిందట వేంపల్లిలో నిర్మించిన కళ్యాణ మండపాన్నివెంటనే ప్రారంభించాలని డాక్టర్ తులసి రెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ నిర్వహణ సరిగా లేని కారణంగా 4 సంవత్సరాల క్రిందట మూతపడిందన్నారు. దీన్ని కూల్చివేసి మళ్ళీ అదే స్థలంలో 1 కోటి 30 లక్షల రూపాయలతో కొత్త కళ్యాణ మండపాన్ని నిర్మించారు. అది పూర్తి అయి 5 నెలలు అయిందని ఇప్పటివరకు ప్రారంభం కాలేదన్నారు. ఇలాగే కొనసాగితే మళ్ళీ శిథిలావస్థకు చేరుకుంటుంది. వెంటనే ప్రారంభించాలని టీటీడి అధికారులకు తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్... చికెన్ ధరలు ఢమాల్..!!

విశాలాంధ్ర-గాలివీడు: బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ తో చికెన్ ధరలు పడిపోయాయి.ఉభయ గోదావరి జిల్లాలల్లో నెలరోజులుగా లక్షల కోళ్లు మృత్యువాత పడగా, కానూరులోని ఓ పౌల్ట్రీలో బర్డ్ ఫ్లూ నిర్ధారణ కావడంతో అప్రమత్తమైన అధికారులు చికెన్ క్రయ విక్రయాలను నిలుపుదల చేశారు. ఈతరుణంలో చికెన్ తినొద్దని అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు.దీంతో రాయల సీమ జిల్లాల్లో కూడా బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ తో చికెన్ ధరలు భారీగా పడిపోయాయి. కేజీ రూ. 250 నుండి 150 కి పడిపోయింది. దీంతో చికెన్ ధరలు భారీగా తగ్గిపోయాయి. అయినా కూడా చికెన్ కొనడానికి.. తినడానికి ఆలోచించాల్సిన పరిస్థితి నెల కొన్నది. బర్డ్ ఫ్లూ ప్రభావంతో పౌల్ట్రీ యజమానులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందంటున్నారు పలువురు. కొనుగోళ్లు తగ్గడంతో చికెన్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు.బర్డ్‌ఫ్లూ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు కొన్ని రోజుల పాటు చికెన్ తినడం తగ్గించడం, లేదా మానేయడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

రైతుల భూముల యూనిక్ ఐడి కోసం వివరాలు నమోదు చేసుకోండి

విశాలాంధ-రామాపురం : రైతులు భూముల యూనిక్ ఐడి కోసం భూమి యొక్క పట్టాదారు పాసుబుక్ లేదా వన్ బి రైతు ఆధార్ కార్డు సంబంధిత లింకు ఉన్న ఫోన్ నెంబర్ రైతు సేవ కేంద్రంలో నమోదుచేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని నల్లగుట్ట పల్లి రైతుసేవ కేంద్రంను మంగళ వారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలేషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు (యూనిక్ ఐడి) ఆధార్ కార్డ్ తరహాలో ఇస్తుందన్నారు సొంత భూములు గల రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న వివిధ పథకాలు రాయితీలు పిఎం కిసాన్ ఎరువుల రాయితీలు పెట్టుబడి రాయితీలు పంటల రుణాలు వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల సేవలు పొందాలంటే రైతు ఈ 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరి నమోదు చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ నమోదు కార్యక్రమం గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాలలో నమోదు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై నాగమణి ఏఈఓ కవిత రైతుకే సేవ కేంద్రం సిబ్బంది లక్ష్మీదేవి రైతులు పాల్గొన్నారు.

మదనపల్లి టీడీపీలో ముదిరిన వర్గపోరు

- శ్రీరామ్ చిన్నబాబు, ఎమ్మెల్యే షాజహాన్ బాష మధ్య చెలరేగిన చిచ్చు

-30 యాక్టును అమల్లోకి తీసుకొచ్చిన పోలీసులు

విశాలాంధ్ర- మదనపల్లె : మదనపల్లె తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. దీంతో మదనపల్లె లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఏ క్షణంలో ఏం జరుగుతుం దోవనన్న ఆందోళనలో ప్రజ లు ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. మదనపల్లె తెలుగు దేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడిగా శ్రీరామ్ చిన్నబాబు కొనసాగుతు న్నారు. పార్టీలో గత ఐదేళ్లుగా ఉన్న శ్రీరామ్ చినబాబు పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశా రు. చంద్రబాబునాయుడు ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా అంగళ్లుకు వచ్చిన సందర్భంలో చెలరేగిన ఘర్షణల్లో శ్రీరామ్ చినబాబు ఎదురొడ్డి నిలబడి పోరాడాడు. కేసుల్లో ఇరుక్కుని పోరాటం చేశాడు. కాగా ఎన్నికల సమయంలో నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర లో కాంగ్రెస్ పార్టీ నుంచి షాజహాన్ బాష తెలుగుదేశం పార్టీ లో చేరాడు. అనంతరం టిడిపి టికెట్ ను సంపాదించి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలు పొందారు. ఎమ్మెల్యే అయిన కొద్ది రోజుల నుంచే పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. పార్టీ కోసం కష్టపడి ఎమ్మెల్యేని గెలిపించుకున్న తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ప్రత్యర్థ పార్టీ వాళ్లని పార్టీలోకి ఆహ్వానిస్తూ వారినే అందల మెక్కిస్తున్నారని ఆరోపిస్తూ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు ఆరోపణలు ఎక్కుపెట్టారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే వర్గీయులు శ్రీరామ్ చిన్నబాబు వర్గాల మధ్య వర్గ పోరు ప్రారంభమైంది. ఈ వర్గ పోరు గత మూడు రోజులుగా తారాస్థాయికి చేరుకుంది. శ్రీరామ్ చినబాబు తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఎమ్మెల్యే లోలోనే మండి పడేవారు. ఈ క్రమంలో మదనపల్లి మండలం సిటిఎం వద్ద స్పిన్నింగ్ మిల్ ప్రాంగణాన్ని లేఔట్ చేసే క్రమంలో శ్రీరామ్ చినబాబుకు చెందిన కొన్ని టిప్పర్లు మట్టిని తోలుతుండగా అటుగా వెళుతున్న ఎమ్మెల్యే షాజహాన్ భాష మట్టి తరలిస్తున్న టిప్పర్ల ను అడ్డుకున్నారు. వీఆర్వో ను పిలిపించి మట్టి తోలేందుకు అనుమతి ఉందా అని ప్రశ్నించారు. లేదని చెప్పడంతో వెంటనే లారీలు, టిప్పర్లు సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న శ్రీరాం చినబాబు సంఘటన స్థలానికి చేరుకుని తమ లారీలు, టిప్పర్లు సీజ్ చేయించడానికి ఎమ్మెల్యే ఎవరు అంటూ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీఆర్వో దగ్గర నుంచి బలవంతంగా లారీ, టిప్పర్ల తాళాలు లాక్కున్నారు. దీంతో సదరు వీఆర్వో స్థానిక రూరల్ తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి పట్టణంలోని రామారావు కాలనీలో ఉన్న సుమన్ టీవీ కార్యాలయానికి చినబాబు వచ్చారన్న సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే వర్గీయులు అతనిపై భౌతిక దాడి చేయాలన్న ఉద్దేశంతో గుంపులుగా రామారావు కాలనీ చేరుకున్నారు. ఇంతలోనే సమాచారాన్ని పసిగట్టిన శ్రీరామ్ చినబాబు వర్గీయులు అధిక సంఖ్యలో రామారావు కాలనీకి చేరుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గుంపులు, గుంపులుగా ఉన్న ఇరువర్గాల వారిని చెదరగొట్టి అక్కడ నుంచి పంపించేసి ఎలాంటి అల్లర్లు జరగకుండా కట్టడి చేశారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి శ్రీరామ్ చినబాబు ముఖ్య అనుచరుడు, రాజంపేట తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుదర్శన్ రెడ్డికి నీరుగట్టువారిపల్లెలో ఉన్న సుధా బ్యూటీ పార్లర్, సుధా ఫోటో స్టూడియో ను కొందరు దుండగులు ధ్వంసం చేశారు. షాపు ముందున్న రేకుల షెడ్డు ను పూర్తిగా కూల్చేశారు. సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. దీంతో మంగళవారం శ్రీరాం చినబాబు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టిడిపి పార్టీ కోసం ఎంతో కష్టపడిన పనిచేసిన సుదర్శన్ రెడ్డి షాపుపై ఎమ్మెల్యే వర్గీయులే దాడి చేశారని ఆరోపించారు. ఏదైనా ఉంటే నేరుగా తేల్చుకుందాం అంటూ సవాల్ విసిరారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా డిఎస్పీ కొండయ్యానాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాన్ బెలబుల్ సెక్షన్ల కింద. కేసులు నమోదు చేస్తామన్నారు. అల్లర్లు సృష్టించేవారిపై పీడీ యాక్టు పెట్టేందుకు కూడా వెనుకాడబోమన్నారు. మదనపల్లె లో 30 యాక్టును అమల్లోకి తెచ్చామని, ఎవరూ గుంపులుగా ఉండకూడదని తెలిపారు. ఇదిలా ఉండగా ఎన్టీఆర్ సర్కిల్లోని నారా లోకేష్ కటౌట్ తో ఉన్న శ్రీరామ్ చినబాబు కటౌట్ కొంతమంది దుండగులు ధ్వంసం చేయడంతో అది కూడా దుమారాన్ని లేపింది. కక్ష్య పూరితంగానే ఎమ్మెల్యే వర్గీయులు తనపై ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని శ్రీరామ్ చినబాబు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఒకే పార్టీకి చెందిన ఇరు వర్గాలు నువ్వా నేనా అంటూ దాడులు, ప్రతిదాడులకు తెగబడేందుకు సిద్ధపడుతుండంతో మదనపల్లి లో ఉద్రిక్త పరిస్థితిలు నెలకొన్నాయి. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి అధికార పార్టీ టిడిపిలో ఉన్న అధినాయకులు ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాల్సి ఉంది.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

విశాలాంధ్ర-రాయచోటి: భార్యను క్రూరంగా హత్య చేసిన కేసులో భర్త ధనుంజయకు జీవిత ఖైదుగా, 5000 రూపాయలు జరిమానా విధిస్తూ రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి తీర్పు చెప్పారు. రామాపురం మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ పాతపల్లెకు చెందిన ధనుంజయ 2017 సంవత్సరం ఫిబ్రవరి నెల 27వ తేదీన అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తూ చివరకు తమ కుమార్తెను తమ అల్లుడే వారి తమ్ముళ్ల సహాయంతో రాత్రి సమయంలో తలపై బలంగా కొట్టి హత్య చేసినట్లు అప్పట్లో కేసు నమోదు చేశారు. అప్పటి పులివెందుల ఎస్పీ కేకేఎన్ అన్బు రాజన్ ముద్దాయిలను అరెస్టు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్మోహన్ రెడ్డి కేసులో బలంగా వాదనలు వినిపించారు. రామాపురం ఎస్ఐ సాక్షులను సరైన సమయంలో కోర్టుకు హాజరు పరిచారు. కోర్టు పూర్వాపరాలు పరిశీలించి జీవిత ఖైదు తీర్పునిచ్చారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి కోర్టు తీర్పు ఒక గుణపాఠం కావాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు.

సెమిస్టర్ ఫలితాలలో ఎస్కేఎస్సీ విద్యార్థులు ఉత్తమ గ్రేడులు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక ఎస్కేఎస్సీ డిగ్రీ కళాశాలలో యోగివేమన యూనివర్సిటీ వారు 1, 3, 5వ సెమిస్టర్ ఫలితాలలో అత్యుత్తమ గ్రేడులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ సంధ్యాల కొండారెడ్డి, సీఈఓ సంధ్యాల మీనా కొండారెడ్డిలు పేర్కొన్నారు. 5వ సెమిస్టర్ బయో టెక్నాలజీలో జీ.ఆస్మిన్-9.36, పి.శ్రీవల్లి-9.23, బీఏలో పి.స్వాతి సౌమ్య-8.55, బీకాం కంప్యూటర్లో ఎస్. షాహీన్-8.41, మూడవ సెమిస్టర్ బయో టెక్నాలజీలో సీ.దీప-9.40, బీఎస్సీ కంప్యూటర్లో వి.అనిత-9.35, బీకాం కంప్యూటర్స్లో ఎస్.నాగేశ్వరి-9.20, బీఏలో ఈ.అంజలి-9.5, శ్రావణి-9 మొదటి సెమిస్టర్లో డీ.ఎం ముస్తఫా బి-10, ఖుషీ యాదవ్-10, ఎస్ఎం కరీముల్లా-10, వీ.జ్యోత్స్న-10, బయో టెక్నాలజీలో ఎస్.ఇమ్రాన్ వల్లి-9.50, టీ.సుప్రజ-9.50, బీఎస్సీ కంప్యూటర్స్లో ఎస్.షాహీన్-9.50, బీకాం కంప్యూటర్స్లో బి.ఫర్జానా-9 గ్రేడ్ సాధించారని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారు ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

విశాలాంధ్ర-కొండాపురం: మండలంలోని గండ్లూరు గ్రామంలో నాలుగు లక్షల 90వేల డీఎంఎఫ్ నిధులతో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వర రెడ్డి, శంకర్ రెడ్డిలు నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ను మంగళవారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ భూపేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి శాలువ కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంట్ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, గోకులం షెడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్మాణం మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం ఓబన్న పేట గ్రామంలో పార్టీ నాయకుడు అనిశెట్టి కిట్టు కుమార్తె కేశఖండన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగ ప్రసాద్, నారాయణ రెడ్డి, బాబుల్ రెడ్డి, రమేష్ రెడ్డి, అరుణ్కుమార్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, గోరిశెట్టి బాబు, మాధవ రెడ్డి, బాల నాగిరెడ్డి, రెండెద్దుల రామాంజనేయ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, రామమునిరెడ్డి, సుధాకర్ నాయుడు, రామలింగేశ్వర రెడ్డి, రామానాయుడు, రామిరెడ్డి, బుజ్జి, సాయికుమార్ రెడ్డి, వీరశేఖర్ రెడ్డి, రామచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాలలో సత్తా చాటిన వేదవ్యాస విద్యార్థులు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: యోగివేమన యూని వర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో శ్రీ వేదవ్యాస డిగ్రీ కాలేజీ విద్యార్థిని, విద్యార్థినులు యూనివర్సిటీ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వ ర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సెమిస్టర్ బీఎస్సీ విభాగంలో డి.నరేంద్ర 10/10, యు.యస్. లైబ 10/10, జి.మద్దిలేటి 9.5, యస్.రేణుక-9.5, ఎ.సుప్ర జ-9.0, యస్.సాయి వెంకట్-9.0, టి.మానస 9.0, బి.కామ్(కంప్యూటర్) విభాగంలో జి.అనిత-9.5, జి.హరిత-9.5, నబీనా బీ-9.0, యస్.రబీయా-9.0, యస్.శిరీన్-9.0, మూడవ సెమిస్టర్ బీఎస్సీ విభాగంలో సీ.సునంద- 9.65, జి.గౌస్ బి-9.40, డి.ప్రణీత-9.35, బి.కామ్ (కంప్యూటర్) విభాగంలో డి.నీరజ-9.0, మూడవ సెమిస్టర్ బీయస్సీ విభాగంలో సి.సునంద-9.65, జి.గౌస్-9.40, డి.ప్రణీత-9.35, బి.కామ్(కంప్యూటర్) విభాగంలో డి.నీరజ-9.0, బి.అనిత-8.95, కె.పూజిత-8.95, పి.భారతి- 8.90, 5వ సెమిస్టర్ యంపీసీఎస్ విభాగంలో యస్.చాంద్ బి-9.33, యు.నాగేశ్వరి- 9.13, ఎ.నాగ సుష్మిత-9.08, యంయస్సీయర్ విభా గంలో ఎం.పూజిత-9.03, జి.జ్యోతి స్వరూప్-9.02, యస్.మహమ్మద్ అల్తాఫ్-8.77, బికాం కంప్యూటర్ విభాగంలో ఎస్.అతిఫా బాను-8.81, బి.షామీరా 8.59, వై.శరణ్య రెడ్డి-8.54 సాధించారని అన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి.సుదర్శన్ రెడ్డి, యస్.యస్.యస్ కోఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

నేడు మాఘ పౌర్ణమి సంధర్భంగా అన్నదానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: నేడు మాఘ పౌర్ణమి సంధర్భంగా పట్టణంలోని 2టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి గుడి వద్ద మధ్యాహ్నం 12:30గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు, కృష్ణాలయ కమిటీ చైర్మెన్ చల్లా రాజగోపాల్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

చాందినీ బండ్లకు అనుమతి తప్పనిసరి:సిఐ

విశాలాంధ్ర- మదనపల్లె : సిటిఎం నల్లవీర గంగా భవాని జాతరకు చాందినీ బండ్లు కట్టేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సిటిఎం గ్రామంలోని నల్లవీర గంగాభవాని జాతర జరుగుతుందన్నారు. ముఖ్యంగా 14, 15వ తేదీలలో రాత్రి, పగలు తిరణాల సందర్భంగా జనం తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. 14వ తేదీ గ్రామస్తులు అమ్మవారికి చాందిని బండ్లు కదుతారని అయితే వీటికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎవరైతే చాందిని బండ్లు ఏర్పాటు చేస్తున్నారో వారి ఆధార్ కార్డు, వారి అడ్రస్ తో పోలీస్ స్టేషన్లో దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలన్నారు. జాతర సందర్భంగా 14,, 15వ తేదీలలో ట్రాఫిక్ ను మళ్లించామని కాశీరావు పేట నుంచి కొత్త బైపాస్ రోడ్ లో వెళ్లేలా వాహానాలను మళ్లించామని, వాహనదారులు గమనించాలని కోరారు

బాలనేరస్తుడిని అదుపులోకి తీసుకోని దొంగసొత్తు స్వాధీనం

విశాలాంధ్ర- అట్లూరు: అట్లూరు మండలం, అట్లూరు క్రాస్ రోడ్, ఎగువపల్లి కాలనీ కిచెందిన చల్ల కొండయ్య తండ్రి పాలకొండయ్య ఇంటిలో 6.12.2024న తేదీన దొంగతనం జరిగి సుమారు 2 లక్షల రూపాయలు విలువ గల బంగారు వస్తువులు పోయినట్లు ఫిర్యాదు చేయగా అట్లూరు పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయదమైనది. సదరు కేసు బద్వేల్ రూరల్ ఇన్స్పెక్టర్ నాగభూషణ్ యాదవ్ ఆధ్వర్యంలో అట్లూరు రామకృష్ణ మరియు సిబ్బందితో కలిసి క్లూస్ టీంతో మరియు టెక్నికల్ గా విచారించగా, సదరు దొంగతనం ఫిర్యాది బంధువైన బాల నేరస్తుడిగా గుర్తించి అదుపులోకి తీసుకొని దొంగతనము చేసిన బంగారు అతనినుండి స్వాదిన పరచుకొని, సదరు బాల నేరస్తుని కోర్ట్ నందు హాజరుగా పెట్టగా కోర్ట్ వారి ఉత్తర్వులు మేరకు సదరు బాల నేరస్తుడిని బాలల హోంకు తరలించినట్లు ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి: డీఎల్డీఓ

విశాలాంధ్ర- మదనపల్లె : ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని డివిజనల్ అభివృద్ధి శాఖాధికారి అమర్ నాథ్ తెలిపారు. మంగళవారం మదనపల్లె మండలం, పోతబోలు పంచాయతీలోని సచివాలయాన్ని డివిల్డీఓ అమర్నాథరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై స్పందిస్తూ కాలయాపన చేయకుండా పరిష్కరించా లన్నారు. విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్ మస్రూర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీకృతమైన వినూత్న కార్యక్రమంలో

ప్రతిభ కనపరిచిన మిట్స్ విద్యార్థులు

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లెలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ మిట్స్ కళాశాల విద్యార్థులు హైదరాబాద్ లోని విశ్వేశ్వరయ్య భవన్, ఖైరతాబాద్ లో జరిగిన స్థిరమైన జీవనం కోసం ఆవిష్కరణ పరిష్కారాలు అనే థీమ్‌పై కేంద్రీకృతమైన వినూత్న కార్యక్రమం అన్వేషణ 2024-25లో తమ విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డేటా సైన్సు విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. భాస్కర్ సహాయ సహకారంతో విద్యార్థులు చేసిన ప్రాజెక్టులకు ప్రశంసలు అందుకున్నట్లు ఆయన అన్నారు. బి. టెక్ రెండవ మరియు మూడవ సంవత్సరము కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డేటా సైన్స్ చదవుతున్న సి. బాలాజీ, శివారెడ్డి లు రెస్యూమ్ ర్యాంకర్ ప్రాజెక్ట్ కు, టి గోకుల్ మరియు చైతన్య లు అడ్వాన్స్ ఎనర్జీ మేనేజ్మెంట్ సిస్టం లకు ప్రశంసా పత్రాలను అందజేసినట్లు ఆయన అన్నారు. ఆవిష్కరణ, సృజనాత్మకత మరియు స్థిరత్వాన్ని ప్రేరేపించడానికి మరియు ప్రోత్సహించడానికి నిర్వహించబడిన ఈ కార్యక్రమం లో తమ విద్యార్థుల తో పాటు అంగళ్ళు జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులు ఇందులో పాల్గొన్నట్లు ఆయన అన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు బి. భాస్కర్ కు ప్రశంసా అవార్డును అందజేశారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను మరియు గైడ్ ను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ కుసుమ అధ్యాపక బృందం తదితరులు అభినందనలు తెలియజేసారు

బాధిత రైతు కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి సవిత

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడప జిల్లా బి.కొండూరు మండలం గుంతపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో తల్లీ కుమారుడు దుర్మరణం పాలవ్వడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్ సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పొలం పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఒకే కుటుంబానికి చెందిన తల్లీ కుమారుడు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని మంత్రి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబానికి అండగా ఉంటామని, తక్షణ సాయమందించాలని విద్యుత్ శాఖాధికారులను మంత్రి సవిత ఆదేశించారు.

ప్రజా రంజకపాలన అందించడమే లక్ష్యం

మదనపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ భాష

విశాలాంధ్ర-మదనపల్లె: ప్రజా రంజక పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మదనపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ భాష పేర్కొన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు వెళుతోందని కొనియాడారు. మంగళవారం ఆయన రామసముద్రం మండలంలో విస్తృతంగా పర్యటించారు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీ పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని తెలిపారు. మండలంలోని మాలెనత్తం పంచాయతీ సింగం వారి పల్లె చింపరపల్లె గ్రామాలకు చెందిన ముగ్గురు మహిళలు నెల రోజుల క్రితం తిరుపతి రోడ్డు ప్రమాదంలో మృతిచెందరంతో లక్ష్మన్న రెడ్డప్ప రెడ్డి కుటుంబాలకు మూడు లక్షల రూపాయల చొప్పున ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించారు ఈ సందర్భంగా షాజహాన్ భాష మాట్లా దుతూ ప్రజలు ఎలాంటి సమస్య ఉన్న నేరుగా తన వచ్చి కలవవ చ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గౌని వారి విజయ్ కుమార్ గౌడ్ తిప్పన్న రామ్మూర్తి ఇలియాజ్ భాషా రూపేష్ రెడ్డి బందిలి శివ బాలాజీ కృష్ణమూర్తి వివిధ శాఖల అధికారులుతెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోని ఆయాలకు కనీస వేతనాలు ఇవ్వాలి

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఉపాధ్యక్షుడు పి.ఎల్ నర్సింహులు

విశాలాంధ్ర- పీలేరు : ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతోందని ప్రైవేటు పాఠశాలలతో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతామన్న పాలకుల మాటలకు చేతలకు పొంతన లేకుండా పోయిందనడానికి సంవత్సరాల తరబడి ఆయాలకు కనీస వేతనాలు అమలు చేయకపోవడమేనని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఉపాధ్యక్షుడు పి.ఎల్ నర్సింహులు ఆరోపించారు. పీలేరు స్థానిక ఎంపిడిఓ ఆఫీస్ నుండి మదనపల్లి రోడ్ ధర్నా వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్కూల్స్ ఆయాలకు సంవత్సరాల తరబడి వెట్టి చాకిరి చేయించుకుంటూ గౌరవ వేతనం పేరిట ఆరువేల రూపాయల నామమాత్రం వేతనంతో కుటుంబ పోషణకు ఎలా సరిపోతుందని వీరంతా చిరుద్యోగులేనని విద్యా ప్రభుత్వశాఖలో పనిచేస్తున్నామన్న పేరే తప్ప అధికారం మారినప్పుడల్లా ఉద్యోగ భద్రత ఉండదు శ్రమదోపిడీకి చిరునామాగా మారిన వీరిని సర్కారు ముప్పుతిప్పలు పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, వేణు గోపాల్ రెడ్డి ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి నర్సింహులు సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్ వెంకటేష్, దప్పు కళాకారుల సంఘం నాయకులు శ్రీనివాసులు,భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మహబూబ్ అలీ ప్రభుత్వ పాఠశాలల ఆయా యూనియన్ నాయకురాళ్లు యశోదా, వెంకటరత్నమ్మ,విమల, నూర్జహాన్, సుమతి,నేత్రావతి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లను కూటమి ప్రభుత్వం చేపట్టారు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప ను సుందరనగరంగా తీర్చిదిద్దేందుకు కడప ఎమ్మెల్యే ప్రభుత్వ ,విప్ మాధవి రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డిలు కష్టపడి పని చేస్తున్నారని టిడిపి 28వ డివిజన్ యువ నాయకుడు బి. అబ్దుల్లా పేర్కొన్నారు .మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరం 28వ డివిజన్ హబీబుల్లా స్ట్రీట్, బీకేం స్ట్రీట్, శారదా నిలయం, వాసవి అపార్ట్మెంట్ల వద్ద దెబ్బతిన్న రోడ్లను కమిషనర్ మనోజ్ రెడ్డి గారి తో కలిసి అబ్దుల్లా పరిశీలించారు. అనంతరం రోడ్డు మరమ్మత్తు పనులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు పనులు చేపట్టారు. గత ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని ఆయన దుయ్యబెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మాధవి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి సహకారంతో డివిజన్లో దెబ్బతిన్న రోడ్లు డ్రైనేజీ పనులను చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. నగరాన్ని స్వచ్ఛ నగరం గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శామీర్, స్థానిక ప్రజలు, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ జేఈఓ దృష్టికి ఒంటిమిట్ట సమస్యలు

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్ట చెరువు నీటి సంఘం చైర్మన్ పాటూరి గంగిరెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం జేఈఓ వీర బ్రహ్మమును కలిసి ఒంటిమిట్ట చెరువుకు సంబం ధించిన సాగు త్రాగు నీటి విషయమై పూర్తి వివరణ ఇచ్చారు, అదేవిధంగా శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా చెరువుకు 2014 నుండి నీటిని అందించడం జరుగుతూ ఉన్నది కానీ కొన్ని పైపులు నీటి ఒత్తిడిని తట్టుకోలేక పగిలిపోతూ ఉన్నవి కావున వాటి స్థానంలో మరింత బలమైన ఇనుప పైపులను వేసి అనునిత్యం ఒంటిమిట్ట చెరువుకు నీరు ఉండే విధముగా చేయవలెనని, అందుకోసము అగు ఖర్చు టీటీడీ నుంచి అయినను బదిలీ చేసి పనిని పూర్తి చేయాలని, అదేవిధంగా చెరువు నడిభాగంలో ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేసి పర్యాటక రంగం కోసం వచ్చిన భక్తులకు ఆహ్లాదకరంగా బోటింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేయవలెనని తెలియజేశారు, మరియు ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయముకు వచ్చు భక్తులందరికీ టీటీడీ వారి తరఫునుంచి అన్న ప్రసాదము ఏర్పాట్లు జరుగుతూ ఉన్నది అదేవిధంగా ప్రైవేట్ అన్న సత్రములు కూడా నడుపుచున్నారు టీటీడీ వారు నడుపు అన్న ప్రసాదము మధ్యాహ్నము మాత్రమే జరుగుతున్నది భక్తులు రాత్రి సమయంలో కూడా వస్తూ ఉన్నారు ఉదయం సేవల కోసం రాత్రి సమయంలో ఇక్కడే బస చేస్తున్నారు వారికి కూడా అన్న ప్రసాదము ఏర్పాటు చేయడం మంచిదని తెలియజేశారు. అదేవిధంగా భక్తులు విరాళములను ఆశించి రెండు అన్న సత్రములు అదేపనిగా జీతములు వెచ్చించి మరి భక్తులను తీసుకుపోయి వారి అన్న సత్రంలలో భోజనం ఏర్పాట్లు చేపిస్తున్నారు దీనిపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి తగు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

గర్భవతులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-నందలూరు : ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం లో భాగంగా మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 51 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తిక్ విశ్వనాథ్‌లు తెలిపారు. గైనకాలజిస్ట్ డాక్టర్ మస్తానమ్మ 42 మంది గర్భవతులకు స్కానింగ్ చేసి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలుగా ఉన్న సమ యంలో గుర్రపు వాతము, మధుమేహం, థైరాయిడ్, గుండె జబ్బులు ఉన్న వారిని పరీక్షించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసి గర్భవతులకు బిపి,రక్త పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. అనంతరం రాయల్ సేవ సమితి అధ్యక్షుడు గంగనపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహార వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సునీల్ కుమార్, ఎంఎల్ హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, రాయల్ సేవా సమితి సభ్యులు హరి, భరత్, పెంచలయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

పాత మున్సిపాలిటీలో వాటర్ ట్యాంక్ నిర్మించాలి

విశాలాంధ్ర-రాయచోటి రూరల్ : ప్రజలకు తాగు నీటి సరఫరా అందించాలనే ఉద్దేశంతో అప్పటి రాయచోటి నియోజక వర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే మహల్ హబీబుల్లా 1972లో అప్పటి గ్రామ పంచాయతీ ప్రస్తుత పాత మున్సిపాలిటీ స్థలంలో వాటర్ ట్యాంక్ నిర్మించడం జరిగిందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్ గుర్తుచేశారు. మంగళ వారం పట్టణంలోని పాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 వరకు ప్రజలకు ఉచిత నీటి సరఫరా అందించిన నీళ్ల ట్యాంక్ కాలక్రమేణా దెబ్బ తినడంతో గత ప్రభుత్వం ట్యాంక్ తొలగించి నిర్మించడం మరిచిందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ట్యాంక్ లేని కారణంగా ఆ ప్రాంత ప్రజలు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నారనా న్రు. తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగు పరచుటకు పాత మున్సిపాలిటీలో తొలగించిన నీళ్ల ట్యాంక్ నీ అదే స్థలంలోనే 15 లక్షల లీటర్ల కెపాసిటీ గల అతిపెద్ద నీళ్ల కొత్త ట్యాంక్ నిర్మించి కొత్తపల్లి, అలీమాబాద్ వీధి, బేతలకాలనీ, కుమ్మర మిట్ట ప్రాంతాన్ని 24 గంటలు పుష్కలంగా నీటి సరఫరా చేయాలని కూటమి ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ సెక్రెటరీ తాజుద్దీన్, ఆఫీజుల్లా, షేక్ రఫీక్ పాల్గొన్నారు.

రాచమల్లును కలిసిన పురపాలక నగర దీపికలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: గత 12 సంవత్స రాల నుండి ప్రొద్దుటూరు పురపాలక సంఘం నందు నగర దీపికలుగా పనిచేస్తున్న 25మంది మహిళలను మార్చి నుండి తొలగిస్తామని మున్సిపల్ కమీషనర్ వారికి తెలియజేయ డంతో ఈ సందర్భంగా వారందరూ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్ రెడ్డిని వారి స్వగృహంలో కలిసి తన బాధను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా రాచమల్లు వారితో మాట్లాడుతూ మిమ్మల్ని తొలగించకుండా ఉండేందుకు మార్చిలో జరగబోయే మున్సిపల్ కౌన్సిల్లో పోరాటం చేస్తామని వారికి ధైర్యం చెప్పారు. మీకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

అంతర్జాతీయ దొంగలు అరెస్ట్

బంగారు నగలు, రెండు బైకులు స్వాధీనం

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండలం లోని రేకులకుంట గ్రామ సమీపంలో ఉన్న రాణి బాయి వాహనాలు తనిఖీ చేస్తుండగా అంతర్జాతీయ దొంగలు ప్రొద్దుటూరు పట్టణానికి చెంది న మల్లెల భరత్ కుమార్, కేవడి రాజా అంతర్జాతీయ దొంగలను బ్రహ్మంగారి మఠం ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా మైదుకూరు నుండి బద్వేల్ వైపు వెళుతుండగా వాహనాలు తనిఖీ చేయడం అందులో భాగంగానే విచారించగా నెల్లూరు వెళుతున్నామని పోలీసు లను నమ్మించడంతో తన పైన వచ్చిన అనుమానాన్ని విచారించగా ఈనెల ఏడో తేదీన బ్రహ్మంగారిమఠం పట్టణానికి చెందిన మండ్ల నాగమ్మ మెడలో బంగారు సరుడును దొంగలించడంతో దొంగత నాన్ని చేసినట్లుగా వారే ఒప్పుకున్నారు. అదే విధంగా బద్వేల్ లో కూడా బంగారు చైన్ దొంగతనం చేసినట్లుగా తెలంగాణలో రాయల్ బుల్లెట్ దొంగ తనం చేసి కాచిగూడలో 18 కేసులు, కడప జిల్లాలో పలు చోట్ల ఏడు కేసులను నమోదు అయి నట్లు విచారణలో నేరం స్వయంగా వారు ఒప్పుకున్నట్లుగా ఎస్పై తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివ శంకర్ కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పెడుతున్నట్లు వారు తెలిపారు. అంతర్జాతీయ దొంగలను పట్టుకున్నం దుకు బ్రహ్మంగారిమఠం ఎస్ఐను వారి సిబ్బందిని అభినం దించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గుర్రప్ప, పాల్గొన్నారు.

బాధితునికి మానవత ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : వైద్య ఆరోగ్యశాఖలో గతంలో పనిచేసిన కే.ఎస్. వరప్రసాద్ గత తొమ్మిది నెలల నుండి మెదడు, ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతూ హైదరాబాదులోని ఆసుపత్రి లో అలాగే ప్రస్తుతం తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోమాల్లో ఉన్నారు. ఇప్పటివరకు సుమారు గా 50 లక్షల రూపాయలు వైద్యానికి ఖర్చు చేశారని ఇంకా వైద్యానికి డబ్బులు అవసరమని వరప్రసాద్ కుమారుడు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్కిరెడ్డిపల్లి శాఖ వారిని సంప్రదించగా వెంటనే వారు స్పందించి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ 5000, వై.ప్రసాద్ యాదవ్ 5000, కే.బలరాం రాజు 2000, బి. దేవేంద్ర 2000, ఇ.వి. కృష్ణ చైతన్య రెడ్డి 2000, డి.రామచంద్ర 1000 రూపాయలు మొత్తం 17000 రూపాయలను వరప్రసాద్ కుమారుడికి అందజేయడం జరిగిం దన్నారు. కేంద్ర కమిటీ సభ్యులు వై.ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ఎవరైనా దాతలు సహాయం చేయాలనుకుంటే కె.వంశీ కృష్ణ 8977377883 కి ఫోన్ పే కానీ, అకౌంట్ నెంబర్ 14601010011 1659 యూనియన్ బ్యాంక్ కడప, ఐఎఫ్ఎస్‌సి కోడ్ యుబిఐఎన్ 0814 601 కు నగదును బదిలీ చేసి మానవ త్వాన్ని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా కేంద్ర కమిటీ సభ్యులు వై.ప్రసాద్ యాదవ్, చైర్మన్ బాలసుబ్రమణ్యం, అధ్యక్షు లు ఎస్.ఎం.డి షఫీ నాయక్, కో చైర్మన్ శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.రామచంద్ర, కన్వీనర్ శివ య్య, జిల్లా సభ్యులు కృష్ణ చైతన్య రెడ్డి, వివి రమణ రావు, కోశాధికారి రవికుమార్, పకీరయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో తల్లీ, కొడుకు మృతి

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ విజయమ్మ

విశాలాంధ్ర - బద్వేలు : కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలోని బి.కోడూరు మండలంలో విద్యుదాఘాతంతో తల్లి, కుమారుడు మృతి చెందిన సంఘటన పట్ల బద్వేల్ మాజీ శాసన సభ్యురాలు విజయమ్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు ఒకే ఇంట్లో తల్లి, కుమారుడు చనిపోవడం తీవ్రంగా కలచివేసిందని విద్యుత్ పట్ల రైతులు తగిన జాగ్రత్త వహించాలి అని పేర్కొన్నారు. కరెంట్ షాక్ తో మృతి చెందిన వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఐదు లక్షల రూపాయల చెక్కును ఎలక్ట్రిక్ డిపార్ట్మెంట్ వారిచే అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌తో మాట్లాడి కూటమి ప్రభుత్వం తరపున బాధిత కుటుంబానికి న్యాయం చేకూర్చుతామని తెలియజేశారు.

శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయదుంధుభి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు యోగివేమన యూనివర్సిటీ విడుదల చేసిన 1వ, 3వ, 5వ సెమిస్టర్ ఫలితాలలో "యూనివర్సిటీ ఫస్ట్" ర్యాంకులను కైవసం చేసుకున్నారని కళాశాల కరస్పాండెంట్ ఎ.హరి నారాయణ తెలిపారు. డిగ్రీ 1వ సెమిస్టర్ బీ.యస్సీ హానర్స్ జువాలజి కోర్సులో పి.మంజు లత, ఏ.మాధవి, జీ.తేజస్విని, ఎన్.లక్ష్మీలాలసలు నలుగురు 10/10జీపీఏలతో మొత్తం 7మంది విద్యార్థులు 10/10జీపీఏ సాధించారని అన్నారు. అలాగే 1వ సెమిస్టర్‌లో బియస్సీ జువాలజి కోర్సులో యు.బాలాజి, ఎస్.గౌసియా బేగం, ఎం.సుప్రియలు-9.5 జీపీఏతో, బీఎస్సీ కంప్యూటర్స్‌లో బి.స్వర్ణ-9.5, బీసీఏలో పి.జ్యోతి, నాగశ్వేతలు 9జీపీఏ, బీబీఏ కోర్సులో బి.లక్ష్మి ప్రవల్లిక, ఫర్హానా, ఎస్.అబ్రార్ 9జీపీఏ, బీఎస్సీ జువాలజీలో ఎస్.సుహానా, ఆర్షాద్‌లు 9జీపీఏలు సాధించారని అన్నారు. అలాగే 3వ సెమిస్టర్‌లో బీఎస్సీ జువాలజీ కోర్సులో జీ.తస్లీమ్-9.85, జీ.సంధ్య-9.7, శాంతి-9.55, కె.చందన-9.55, జీ.అశ్వి ని-9.1లు, బీఎస్సీ బయో టెక్నాలజీలో జ్ఞాన శ్రీ-9.85, తన్మయి- 9.85, కె.ప్రవీణ-9.85, వీ.దేవిక రెడ్డి-9.55, ఎం.శ్రావణి, సాత్విక లు-9.1లు, బీసీఏ గ్రూపులో వి.పవిత్ర-9.85, అయేషా-9.8, నూరీన్-9.7, యాస్మిన్ 9.45, వీ.ప్రవల్లిక 9.3, వి.జయశ్రీ 9లు, అలాగే బీకాంలో ఎన్.పరిమళ 9, ఉమామహేశ్వర్ 9.2, హసీనా9.3లు సాధించారు. బీఎస్సీ కంప్యూటర్స్‌లోటీ లక్ష్మి ప్రసన్న-9.25 సాధించారని, అలాగే డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాలలో బీయస్సీ బై.జడ్‌జీసీ గ్రూపులో ఎస్.రెహానా-9.79, అల్లురాణి- 9.61, బి.అను ష్క-9.43, మౌనిక-9.41, స్రవంతి-9.39, ఎస్.షబానా- 9.36, షమీయా- 9.32, మానస-9.28, సుశీల్-9.25, ఎస్.అయేషా- 9.24, అపర్ణ-9.23, టి.చిత్రాదేవి-9.2, రుబీనా-9.08, నవ్య-9.07లు, బీకాంలో పీ.యాస్మిన్- 9.01, ధనశ్రీ-8.93లు సాధించారని అన్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్ డా. మహమ్మద్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపాల్ శారద, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.రామ మోహన్, గౌరిశంకర్, గంగాభవాని, మౌనయ్య, అస్మత్, నరేష్‌లు అభినందించారు.

అసత్య ఆరోపణలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పిర్యాదు

విశాలాంధ్ర- సుండుపల్లె: సోషల్ మీడియా వాట్సాప్ గ్రూపులలో తప్పుడు కథనాలను ప్రచురించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకురాలు వీర మహిళ నంద్యాల రెడ్డిరాణి మంగళవారం ఫిర్యాదు చేశారు. వైసిపి మండల కన్వీనర్ రామస్వామిరెడ్డితో పాటు మరికొందరిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఎస్ఐ శ్రీనివాసులును కోరారు.

మంచినీటి కొరత అరికట్టాలని ఎండిఓకు వినతి

విశాలాంధ్ర -సుండుపల్లె: మండల పెద్దినేని కాలవ పంచాయతీ తోటి మాలపల్లిలో ఫిబ్రవరి నెలలోనే మొదలైన మంచినీటి యొద్దడని పరికట్టాలని ఎంపీడీవో సుధాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు సుమారు 65 కుటుంబాలు ఉంటున్నారని మంచి నీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. గత 76 సంవత్సరాలుగా మారుమూల గ్రామాల అభివృద్ధి చెందకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల సమయంలో నాయకులు మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని తర్వాత తిరిగి చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు అధికారులైన స్పందించి నీటి యెద్దడి అరికట్టాలన్నారు.

మాకు న్యాయం చేయండి

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని శ్రీరామ్ నగర్ వద్ద ఉన్న సర్వే నెంబర్ 54/5ఎ 76 సెంట్లు అంకిరెడ్డి పల్లె రామసుబ్బమ్మకు అదే గ్రామానికి చెందిన లక్ష్మయ్య అమ్మ అమ్మకం చేసి రిజిస్ట్రేషన్ చేశారని కొంతమంది తనపై దౌర్జన్యం చేసి వారిపై తప్పుడు కేసులు నమోదు చేయించారని ఈ విషయం కోర్టు వరకు వెళ్లగా కోర్టు విచారించి తనకు ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వడం జరిగిందని తనపైన కక్ష సాధింపుతో వేధింపులకు కొంతమంది గురి చేస్తున్నారని మాపై వేధించే మా కొడుకులకు ప్రాణహాని ఉందని రామసుబ్బమ్మ మంగళవారం మీడియాతో తెలిపారు. తన కొడుకులైనా అంకిరెడ్డి పల్లె రామిరెడ్డి లక్ష్మిరెడ్డి పైన వేధింపులు గురిచేస్తున్నారని మా కుటుంబానికి ఏమైనా జరిగిన మాపై తప్పుడు కేసులు పెట్టిన వారే కారణమని వారు పేర్కొన్నారు. మా కుటుంబానికి న్యాయం జరిగే విధంగా అధికారులు చూడాలని వారు కోరారు.

పివై నరసింహులుకు సీపీఐ ఘన నివాళి

విశాలాంధ్ర – బద్వేలు : బద్వేల్ పట్టణంలోని మర్తోమ నగర్‌లో సీపీఐ సీనియర్ నాయకుడు నరసింహులు మృతికి, సందర్భంగా, ఆయన ఇంటి వద్దకు వెళ్లి, పార్థివ దేహానికి ఎర్రజెండా కప్పి పూల దండలు వేసి ఘనంగా సంతాపం తెలిపిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వద్ద మాను వీరశేఖర్, ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ అంకితభావంతో 30 సంవత్సరాలుగా పార్టీ సభ్యుడుగా, పట్టణ కార్యదర్శిగా, ఆఫీస్ శాఖ సెక్రెటరీగా నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు పార్టీ నాయకుడు బద్వేల్ పార్టీ ఆఫీస్ నిర్మాణంలో కీలక సభ్యుడిగా ఉండి అనునిత్యం పార్టీ కోసం, వారి భార్య ,వారి కుమార్తె పనిచేయడం చాలా సంతోషమని ఈ రోజుల్లో ఆ విధంగా పనిచేసే వాళ్లు అరుదు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలోఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, పట్టణ కార్యదర్శి బాలు,, రూరల్ కార్యదర్శి ఇమ్మానుయేలు, కార్యవర్గ సభ్యులు పడిగే వెంకటరమణ, ననమాల చెన్నయ్య, నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మెరువ మల్లికార్జున, పుల్లయ్య, నవీను,, మల్లేష్ పార్టీ సభ్యులు వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకే భద్రతా వారోత్సవాలు

విశాలాంధ్ర – రాజంపేట: రోడ్డు ప్రమా దాలను తగ్గించేందుకే ప్రభుత్వం ప్రతి ఏటా రహదారి భద్రత వారోత్సవాలను నిర్వహించడం జరుగుతోందని జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్ తెలిపారు. మంగళవారం అన్నమాచార్య యూనివర్సిటీలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతా నియమాల ను పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. తల్లితండ్రు లు మీకు జన్మ ఇస్తే, హెల్మెట్ మీకు పునర్జన్మ ఇస్తుందన్నా రు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వారిని అభినందించాల న్నారు. వాహనదారులు బయటకు వెళ్లేట ప్పుడు, కుటుంబ సభ్యులు తమ కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని గుర్తుంచు కోవాలన్నా రు. ప్రమాదాల్లో పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుం దన్నారు. ద్విచక్ర వాహనదారు లు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, అతివేగం అనర్థదాయకమని, మద్యం తాగి వాహనం నడపవద్దని చెప్పారు. ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు. ఈ విషయాలను ప్రతి వాహనదారులు గమనించాలని సూచించారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సకాలంలో సమీపంలో ఉన్నటువంటి ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రభుత్వం అందించే పారితోషకాన్ని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

విశాలాంధ్ర–కడప కార్పొరేషన్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దామని మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి.అంజాద్ భాష మరియు జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నందు జిల్లా అధ్యక్షులు .రవీంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన కడప నగర జోనల్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడు తూ రాష్ట్రంలో మళ్లీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారం లోకి తీసుకువచ్చి తిరిగి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రి చేసుకునే విధంగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

అమ్మ జన్మనిస్తే.. హెల్మెట్ పునర్జన్మనిస్తుంది

–అన్నమాచార్య యూనివర్సిటీలో విద్యార్థులకు అవగాహన సదస్సు
– ముఖ్య అతిథులుగా హాజరైన అడిషనల్ ఎస్పీ, జిల్లా రవాణా శాఖ అధికారి

విశాలాంధ్ర – రాజంపేట: నవ మాసాలు మోసిన తల్లి జన్మనిస్తే.. రోడ్డు ప్రమాదాలలో మృత్యువాత పడకుండా హెల్మెట్ పునర్జన్మనిస్తుందని అడిషనల్ ఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే, జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్ అన్నారు. మంగళవారం అన్నమాచార్య యూనివర్సిటీ 36వ రహదారి భద్రత వారోత్సవాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాదీ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు రహదారి భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నిరోధించవచ్చని తెలిపారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను ధరించాలి, కార్లు నడిపేవారు సీటు బెల్టు ధరించాలి, అతివేగం ప్రమాదకరం, మద్యం సేవించి వాహనం నడపకూడదు, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. వాహనదారులు కుటుంబ సభ్యుల కోసం జాగ్రత్తగా వాహనం నడిపించాలనీ, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ చికిత్స అందించేందుకు సమీప ఆసుపత్రికి తరలించాలని, ప్రభుత్వం అందించే “గుడ్ సమారిటన్” పారితోషకంగా రూ.5000 పొందవచ్చని వివరించారు.విద్యార్థులు మానసిక స్థైర్యంతో ఉండాలని, ఆత్మహత్యలు చేసుకోవాలనే ఆలోచన వద్దని సూచించారు. విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆయన అన్నారు.అన్నమాచార్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ డా.ఎస్.ఎం.వి. నారాయణ హాజరయ్యారు. అదనంగా రాజంపేట మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్, మన్నూరు సీఐ అలీ, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌లో ఇంటర్ హాల్ టికెట్లు రావడం సంతోషకరం

విశాలాంధ్ర – మైదుకూరు : వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 161 సేవలను అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిర్ణయం తీసుకొని ఆచరణలోకి తీసుకు రావడం శుభపరిణామం అని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ పేర్కొన్నారు. మంగళవారం మైదుకూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డిభార్గవ్‌తో కలిసి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షల హాల్ టికెట్ వాట్సాప్ లో డౌన్లోడ్ చేయించి అవగాహన కల్పించారు. అనంతరం వాట్సాప్ గవర్నెన్స్ పై విద్యార్థుల యొక్క అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వాట్సప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఒక్క నిమిషంలో డౌన్లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినందుకు విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేస్తుంద న్నారు. గతంలో ఫీజులు చెల్లించలేదని ప్రైవేటు కళాశాలలో హాల్ టికెట్ లు ఆపేయడం వంటి సంఘటనలు చూసాము. ఇప్పుడు స్వేచ్ఛయుతంగా ఎవరి హాల్ టికెట్ వారి సెల్లులో డౌన్లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరు కావచన్నారు. విజనరీ లీడర్ చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నాయకత్వాన మరిన్ని సంక్షేమ పథకాలు సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు బిల్లా నవీన్, ఆసిఫ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సిడబ్ల్యుసి గోడౌన్‌లో బియ్యం, పసుపు, ఆహార నిల్వలను పునఃప్రారంభించాలి

విశాలాంధ్ర–కడప రూరల్ : సిడబ్ల్యుసి గోడౌన్ లో బియ్యం పసుపు ఆహార నిల్వలను పునఃప్రారంభించాలని ఏపీ సిడబ్ల్యుసి గోడౌన్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం అధ్యక్షులు సి సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె. మద్దిలేటి.విజ్ఞప్తి చేశారు. మంగళవారం కడప నగరంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కడప జిల్లా కార్యాలయంలో సహాయ పౌర సమాచార అసిస్టెంట్ గ్రేడ్ వన్ అధికారి టీ.వాణికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిడబ్ల్యుసి గోడౌన్ హమాలి వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం అధ్యక్షులు సి.సుబ్రహ్మణ్యం. ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె. మద్దిలేటి. మాట్లాడు తూ గత 40 సంవత్సరాలు నుండి కేంద్ర గిడ్డంగులు సంస్థ సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ లో హమాలీలుగా పనిచేస్తూ కుటుంబాలు పోషిస్తున్నారన్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం గత ప్రభుత్వం వారు గిడ్డంగులను రిలయన్స్ సంస్థకు ఇచ్చినందుకు పౌరసరఫర శాఖ వారు సదరు గిడ్డంగులలో బియ్యం ఆహార నిల్వలను నిలుపుదల చేసినందున 100 మంది హమాలీలకు పని లేకుండా జీవనోపాధి కోల్పోయింది అన్నారు. గత 40 సంవత్సరాలు పని చేసిన నందున వేరే పనికి పోలేక కుటుంబాన్ని పోషించలేకపోతున్నారన్నారు. సిడబ్ల్యుసి గోడౌన్ బియ్యం పసుపు ఆహార నిల్వలు చేసేందుకు ఇప్పుడు ఖాళీగా ఉన్నటువంటి గోడౌన్లను వెంటనే స్వాధీనం చేసుకొవాలని సిడబ్ల్యుసి గోడౌన్ హమాలీ వర్కర్స్‌కు పని కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి గోడౌన్ హమాలి వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు జి.హనుమంతు, భూషణం, కె.రవి, సి.హనుమంతు. సహదేవుడు, జాన్ , చందు, వెంకటేష్, భాస్కర్, బాలు, సుబ్బారెడ్డి, మస్తాన్, వల్లి, రఘు, సుబ్బానర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు వంద రోజులు పని కల్పించాలి : పీడీ వెంకటరత్నం

విశాలాంధ్ర– రామాపురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో వంద రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని అన్నమయ్య జిల్లా ఉపాధి పిడి వెంకట రత్నం అన్నారు. మండలంలోని నల్ల గుట్ట పల్లి గ్రామంలో ఉపాధి పనులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగుట్ట పల్లి గ్రామంలో 64 మంది కూలీలు పనిచేస్తున్నారు. నాణ్యతగా ఉపాధి పనులు చేపట్టాలన్నారు. జిల్లా లో 58 వేల మంది కూలీలు పనిచేస్తు న్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులు 38 వేల ఎకరాల్లో పండ్ల తోటలను 2024- 25 సంవత్సర ములో పెంచు తున్నారన్నా రు. ఇంకా ఎవరైనా అర్హులైన రైతులు ఉంటే పదరు పండ్ల తోతలను పెంచు కోవచ్చు అన్నారు. ఉపాధి పనులు కావలసిన కూలీలకు పనులు కల్పిస్తా మన్నారు. కూలీలు వలసలు వెళ్లకుం డా ప్రతి ఒక్కరికి పనులు కల్పించా లన్నారు. పచ్చి రైతు తమ పొలాల్లో పారా పండు పనులను చేయించుకోవా లన్నారు. ఈ కార్యక్ర మంలో ఏపీఓ పెంచలయ్య ఈసి శివ య్య, టీఏలు ఉపాది సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకులు డా. శివప్రసాద్‌కు
అశృనివాళి

విశాలాంధ్ర–కడప వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం మైక్రోబయాలజీ శాఖ అకడ మిక్ కన్సల్టెంట్ డా.బి వి.శివప్రసాద్ మృతి వైవియుకు తీరని లోటు అని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. డా.బి వి.శివప్రసాద్ గుండెపోటుతో మృతి చెందారని తెలుసుకొని ప్రొద్దుటూరు లోని అతని నివాసానికి విశ్వవిద్యాలయ ఉపకుల పతి ఆచార్య కృష్ణారెడ్డి, ప్రధాన ఆచార్యులు రఘునాథ రెడ్డి కులసచివులు ఆచార్య పి. పద్మ వెళ్లారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల ఈ క్రమంలో పాల్గొన్నారు. ముందుగా విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనం ముందు అధ్యాపకులు బోధన, బోధనేతర సిబ్బంది సమావేశమై డాక్టర్ శివప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 14 ఏళ్ల పాటు విశ్వవిద్యాలయానికి అందించిన సేవలను కొనియాడారు. జర్నలిజం శాఖ అధ్యాపకుడు డాక్టర్ టి.సురేష్ బాబు, నాన్ టీచింగ్ స్టాఫ్ అయ్యవారయ్య మాట్లాడుతూ శివ ప్రసాద్ తో ఉన్న అనుబంధాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో బోధన బోధ నేతల సిబ్బంది అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.